# వ్యభిచారం చేయాలని బెదిరించిన వారిపై కేసు

హసన్‌పర్తి, మార్చి 18: వ్యభిచారం చేయాలని బెదిరించిన వారిపై హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ సురేశ్ కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన యువతి(22) హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తున్నది. ఈ నెల 10న ఉదయం 11గంటలకు హైదరాబాద్ ఎంజీబీఎస్‌లో బస్సు దిగింది. అప్పటికే ఒంటరి అమ్మాయిల కోసం కాపుకాస్తున్న ఇద్దరు బాలికలు సదరు యువతికి మాయమాటలు చెప్పి ఇబ్రహీంపట్నంలోని తమ ఇంటికి తీసుకెళ్లి తల్లికి అప్పగించారు. రెండు రోజుల తర్వాత బ్రోకర్ల ద్వారా ఈ నెల 13న కారులో యువతిని వంగపహాడ్‌లో ఓ ఇంట్లో బంధించి వ్యభిచారం చేయాలని బలవంతం చేశారు. మరుసటి రోజు ఉదయం 7గంటలకు ఆమె తప్పించుకొని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు 17న కేసు నమోదు చేసిన పోలీసులు ఇబ్రహీంపట్నం మహిళల నుంచి యువతి బ్యాగ్, సెల్‌ఫోన్, రూ.2వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వంగపహాడ్‌లో ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.


నమస్తే తెలంగాణ
ములుగు జయశంకర్ భూపాలపల్లి
5 | మంగళవారం 19 మార్చి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


### వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ ఓటర్లు

| అసెంబ్లీ నియోజకవర్గం | పురుషులు | మహిళలు | థర్డ్ జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| స్టేషన్ ఘన్‌పూర్ | 124659 | 127948 | 01 | 252608 |
| పాలకుర్తి | 126256 | 128533 | 13 | 254802 |
| వర్ధన్నపేట | 133524 | 138514 | 17 | 272055 |
| పరకాల | 108156 | 114105 | 02 | 222263 |
| వరంగల్ పశ్చిమ | 138594 | 143095 | 14 | 281703 |
| వరంగల్ తూర్పు | 124707 | 131428 | 339 | 256474 |
| భూపాలపల్లి | 136631 | 139887 | 06 | 276524 |
| మొత్తం | 892527 | 923510 | 392 | 1816428 |

### మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ ఓటర్లు...

| అసెంబ్లీ నియోజకవర్గం | పురుషులు | మహిళలు | థర్డ్ జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| డోర్నకల్ | 108931 | 113165 | 07 | 222103 |
| మహబూబాబాద్ | 126290 | 131449 | 47 | 257786 |
| నర్సంపేట | 114891 | 120104 | 09 | 235004 |
| ములుగు | 113413 | 118935 | 26 | 232374 |
| పినపాక | 99608 | 103525 | 05 | 203138 |
| ఇల్లందు | 109632 | 114818 | 04 | 224454 |
| భద్రాచలం | 72789 | 79343 | 07 | 152139 |
| మొత్తం | 745554 | 781339 | 105 | 1526998 |

- వరంగల్, మహబూబాబాద్‌కు బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారు
- మహబూబాబాద్‌కు మాత్రమే ప్రకటించిన బీజేపీ, కాంగ్రెస్
- వరంగల్ అభ్యర్థిపై తేల్చని రెండు పార్టీలు.. బీజేపీకి అభ్యర్థులు దొరకని దుస్థితి
- వరంగల్ సీటుపై కాంగ్రెస్‌లో అయోమయం

# లోక్‌సభకు సన్నద్ధం

## ఇటు రాజకీయ పార్టీలు, అటు అధికార యంత్రాంగం సమాయత్తం

*ఈ సారి ఎండాకాలం లోక్‌సభ ఎన్నికలతో మరింత వేడెక్కనుంది. రాజకీయ పార్టీల పోటాపోటీ కార్యక్రమాలు, అభ్యర్థుల ప్రకటనలతో ప్రచార ప్రక్రియ ఊపందుకుంటున్నది. ఇప్పటికే వరంగల్, మహబూబాబాద్‌కు అభ్యర్థులను ప్రకటించి బీఆర్‌ఎస్ ఒక అడుగు ముందుండగా, మహబూబాబాద్‌కు మాత్రమే కాంగ్రెస్, బీజేపీలు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. ఇక వరంగల్ విషయంలో బీజేపీకి అభ్యర్థులే దొరక్కపోగా, హస్తం పార్టీలో అయోమయం నెలకొంది.*

*– వరంగల్, మార్చి 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం మే 13న వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఎన్నికల నోటిషికేషన్ ఏప్రిల్ 18న వెలువడనుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉండనున్నది. ఈ మేరకు ఎన్నికల నిర్వహణ కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది. ఎన్నికల్లో గెలుపు కోసం ప్రధాన పార్టీలు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నాయి. సన్నాహక సమావేశాలతో శ్రేణులను సిద్ధం చేస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియలో బీఆర్‌ఎస్ మిగిలిన రాజకీయ పార్టీల కంటే ముందున్నది. వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య, మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా మాలోత్ కవితను షెడ్యూల్‌కు ముందే ప్రకటించింది. ఇద్దరు అభ్యర్థులు బీఆర్‌ఎస్ శ్రేణులతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీఆర్‌ఎస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు పార్టీ ముఖ్యనేతలు ప్రచార వ్యూహాలను సిద్ధం చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ వరంగల్, మహబూబాబాద్ సీట్లను భారీ ఆధిక్యంతో గెలుచుకున్నది. ప్రస్తుత ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యంగా గులాబీ పార్టీ వ్యూహాలు అమలు చేస్తున్నది.

### పెరిగిన ఓటర్లు 4,28,806

వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ల పరిధిలో కొత్త ఓటర్లు పెరిగారు. 2019 ఎన్నికలతో పోల్చితే రెండు సెగ్మెంట్లలో కలిపి 4,28,806 మంది ఓటర్లు పెరిగారు. 2019 ఎన్నికలప్పుడు వరంగల్ లోక్‌సభ పరిధిలో 15,78,335 ఓటర్లు ఉంటే ఇప్పుడు 18,16,428 ఓటర్లు ఉన్నారు. ఐదేండ్లలో ఈ సెగ్మెంట్‌లో 2,38,094 ఓటర్లు పెరిగారు. మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో 2019లో 13,36,286 ఓటర్లు ఉంటే ఇప్పుడు 15,26,998 ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికల కంటే ఈసారి 1,90,712 ఓటర్లు పెరిగారు.

### ఎవరూ లేని బీజేపీ...

లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులు దొరక్కపోవడంతో బీజేపీ ఆగమవుతున్నది. ఇతర పార్టీల నుంచి వచ్చే నాయకుల కోసం వేచి చూస్తున్నది. బీఆర్‌ఎస్ నుంచి ఇటీవలే పార్టీలో చేరిన మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్‌ను మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించింది. వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ అభ్యర్థిత్వం కోసం ఎవరూ లేకపోవడంతో ఇతర పార్టీల నాయకుల కోసం ప్రయత్నిస్తున్నది. బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న అరూరి రమేశ్‌ను రెండు రోజుల క్రితం బీజేపీలో చేర్చుకున్నది. వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా అరూరి రమేశ్‌ను బీజేపీ రెండుమూడు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉన్నది. ఇదే సెగ్మెంట్‌లో టికెట్ కోసం రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కృష్ణ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు చింతా సాంబమూర్తి ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 17 సీట్లలో 15 స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. ఎవరూ లేకపోవడంతో వరంగల్ సీటును పెండింగ్‌లో పెట్టింది.

### కాంగ్రెస్‌లో అయోమయం

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సైతం వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ అభ్యర్థిపై తేల్చడం లేదు. మహబూబాబాద్ అభ్యర్థిగా మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్‌ను కాంగ్రెస్ ప్రకటించింది. వరంగల్ అభ్యర్థిత్వంపై స్పష్టత ఇవ్వడం లేదు. గెలుపు అవకాశాలపై ధీమా ఉన్న నాయకుడు లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఉన్నదని కాంగ్రెస్ నాయకుల్లో చర్చ జరుగుతున్నది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓడిపోయిన దొమ్మాటి సాంబయ్య, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శనిగపురం ఇందిర, మరో నాయకుడు రామగళ్ల పరమేశ్వర్ టికెట్ ఆశిస్తున్నారు. రెండు రోజుల క్రితం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వరంగల్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ అధికార పార్టీ టికెట్‌పై ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఎవరిని అభ్యర్థిగా ప్రకటిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.





కాశీబుగ్గలోని నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

# తొలిరోజు ప్రశాంతంగా..

## ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

*పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభం కాగా, తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. మొదటిరోజు తెలుగు పరీక్ష ఉండగా పరీక్ష కేంద్రాల వద్ద తల్లిదండ్రులు తమ పిల్లలకు 'ఆల్ ది బెస్ట్' చెబుతూ సాగనంపడం కనిపించింది. కాగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సజావుగా జరిగినట్లు అధికారులు తెలిపారు. వరంగల్ జిల్లాలో 9,448మంది విద్యార్థులకు గాను 9,432మంది, హనుమకొండలో 12014మందికి 12వేలు, జయశంకర్ భూపాలపల్లిలో 3547 మందికి 3536, ములుగులో 388మందికి 3081, జనగామలో 6698మందికి 6687, మహబూబాబాద్‌లో 8,192 మంది విద్యార్థులకు గాను 8,173 మంది హాజరయ్యారు.*

*– నమస్తే నెట్‌వర్క్, మార్చి 18*



కాలుకు గాయమైన తన కొడుకును పరీక్ష కేంద్రానికి తీసుకువస్తున్న తల్లి




పాఠక్ మహల్‌లోని ఎస్ఆర్ పరీక్ష కేంద్రానికి విద్యార్థినిని తీసుకెళ్తున్న మట్టెవాడ పోలీసులు



దేవుడికి దండం పెట్టి తన కూతురుకు పెన్నును అందిస్తున్న తల్లి



హనుమకొండ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చెక్ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపిస్తున్న టీచర్

# సీఐ 'సమయ'స్ఫూర్తి.. సకాలంలో సెంటర్‌కు..

పోచమ్మమైదాన్, మార్చి 18 : తాను రాయాల్సిన పరీక్ష సెంటర్‌కు బదులు మరో కేంద్రానికి వెళ్లిన విద్యార్థినిని గుర్తించిన మట్టెవాడ పోలీసులు సమయానికి బాలికను సెంటర్‌కు చేర్చారు. వరంగల్ రామన్నపేటకు చెందిన సిలువేరు హనీ పదో తరగతి పరీక్ష రాసేందుకు బ్యాంక్‌కాలనీలోని ఎస్సార్ హైస్కూల్‌కు వెళ్లింది. అయితే, ఆమె పాఠక్ మహల్‌లోని సెంటర్‌లో రాయాల్సి ఉంది. పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు ఐదు నిమిషాల సమయం మాత్రమే ఉండడంతో ఆందోళనకు గురైంది. అక్కడే విధుల్లో ఉన్న మట్టెవాడ సీఐ తుమ్మ గోపి వెంటనే తమ వాహనంలో బాలికను ఎక్కించుకొని పరీక్ష సెంటర్‌కు తీసుకెళ్లారు. సకాలంలో పరీక్ష కేంద్రానికి చేర్చడంతో బాలిక తల్లిదండ్రులు సీఐకి కృతజ్ఞతలు తెలిపారు.




సమీక్షలో పాల్గొన్న ఆర్వో, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్‌ఝా, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి కలెక్టర్లు

# నాడు ఉపాధ్యాయుడు.. నేడు జైలర్

### లంబాడా బిడ్డకు పెద్ద పోస్టు

### చెర్లపల్లి జైల్ సూపరింటెండెంట్‌గా సమ్మయ్య

ములుగు, మార్చి18 (నమస్తేతెలంగాణ) : పేద గిరిజన లంబాడా కుటుంబంలో పుట్టిన ఆయన ప్రభుత్వ పాఠశాల, సంక్షేమ హాస్టళ్లలో ఉండి చదువుకుని నేడు ఉన్నత స్థాయికి ఎదిగాడు. ఉన్నత చదువుల కోసం కూలీ పనులకు వెళ్లి ఉపాధ్యాయ కొలువు కొట్టాడు. ఆ వృత్తిలో కొనసాగుతూనే డిప్యూటీ జైలర్ ఉద్యోగాన్ని సాధించాడు ములుగు జిల్లా ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామానికి చెందిన గుగులోత్ సమ్మయ్య. జైళ్ల శాఖలో డిప్యూటీ జైలర్‌గా తన ప్రస్తానాన్ని ప్రారంభించిన ఆయన ఇటీవల ఎస్పీగా పదోన్నతి పొంది ప్రస్తుతం చెర్లపల్లి జైలు సూపరింటెండెంట్‌గా బాధ్యతలను స్వీకరించారు. దీంతో ములుగు జిల్లా కేంద్రంతో పాటు దేవగిరిపట్నం గ్రామంలో ప్రజలతో పాటు స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

### ఖైదీల పరివర్తనకు విశేష కృషి

గుగులోత్ చందూనాయక్–తారమ్మ ప్రథమ సంతానం సమ్మయ్య. ఆయన 1963లో దేవగిరిపట్నం గ్రామంలో జన్మించాడు. ఆయనకు ఇద్దరు చెల్లెళ్లు, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. 5వ తరగతి వరకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసించారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ములుగు ఎస్టీ హాస్టల్‌లో ఉంటూ విద్యను కొనసాగించారు. అనంతరం కాకతీయ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, హనుమకొండలో బీఈడీ పూర్తి చేశారు. కేయూలో ఎంఏ పూర్తి చేసిన తర్వాత ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి తొలి పోస్టు జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆ తర్వాత 1992లో డిప్యూటీ జైలర్‌గా ఉద్యోగం సాధించి వరంగల్ సెంట్రల్ జైళ్లో పనిచేశారు. సూర్యాపేట, రాజమండ్రి, మెదక్, జమ్మలమడుగు జైళ్లలో పనిచేసి ఖైదీల పరివర్తనకు విశేష కృషి చేశారు. ఆ తర్వాత పదోన్నతి పొంది కరీంనగర్ జైలు సూపరింటెండెంట్‌గా నాలుగేళ్ల పాటు పనిచేసి ఇటీవల ఎస్పీగా పదోన్నతి పొంది చర్లపల్లి జైల్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. సమ్మయ్యకు భార్య అనిత, కుమారుడు వికాస్, కుమార్తె అలేఖ్య, అల్లుడు షణ్ముఖకుమార్ ఉన్నారు. కుమారుడు ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేసి ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తె, అల్లుడు వైద్యులుగా స్థిరపడ్డారు. కాగా, విధి నిర్వహణలో ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు. ఏ చిన్న సమయం దొరికినా పుట్టి పెరిగిన ఊరికి వచ్చి గ్రామస్తులతో స్నేహపూర్వకంగా మెదులుతూ వస్తున్నారు.



*చర్లపల్లి జైలు సూపరింటెండెంట్‌గా ఈ నెల 16న విధుల్లో చేరిన గుగులోత్ సమ్మయ్య*

# అద్భుత ఫలితాలు సాధించొచ్చు

## హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్

కాశీబుగ్గ, మార్చి18: వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు సమన్వయంతో పనిచేస్తే వ్యవసాయ రంగంలో అద్భుత ఫలితాలు సాధించొచ్చని హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. ములుగురోడ్డులోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో మధ్య తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం రెండు రోజుల సమావేశాలను సోమవారం కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను ఆమె పరిశీలించారు. పంటల సాగు విధానంలో ఒకరి అనుభవాలను మరొకరు పంచుకుంటూ అనువైన పద్ధతులను అవలంబిస్తే రైతులు గణనీయమైన ప్రగతి సాధిస్తారన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడి సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ రావుల ఉమారెడ్డి, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురాంరెడ్డి, డాక్టర్ సుధారాణి, జేడీ రవీందర్‌సింగ్, శ్రీనివాస్, కళాశాల డీన్ డాక్టర్ బలరాం, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్‌కుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ మాలతి, ఆర్ఈఏసీ సభ్యులు, 11 జిల్లాల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

# ఎన్నికలు సజావుగా జరగాలి

## అధికారులు బాధ్యతతో పనిచేయండి.. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

## పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్ష.. పాల్గొన్న సీపీ, కలెక్టర్లు, డీసీపీలు

గిర్మాజీపేట, మార్చి 18 : వచ్చే పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతతో పనిచేయాలని వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, వరంగల్ జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. ఈమేరకు సోమవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీపీ అంబర్‌కిషోర్‌ఝా, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి కలెక్టర్లు సిక్తా పట్నాయక్, షేక్ రిజ్వానా బాషా, భవేశ్‌మిశ్రా, భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే, డీసీపీలతో కలిసి పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉన్న 1,899 పోలింగ్ కేంద్రాల్లో 419 కేంద్రాలు సమస్యాత్మకమైనవని గుర్తించామని తెలిపారు. ఆయాచోట్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రోజువారీ నివేదికలను ఎలాంటి తప్పుల్లేకుండా సకాలంలో పంపాలని సూచించారు.

### సమష్టి కృషిచేయాలి : సీపీ అంబర్ కిషోర్‌ఝా

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు సమష్టిగా కృషిచేయాలని సీపీ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరింత సమర్థవంతంగా పనిచేయాలని చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద అప్రతమ్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలుచేస్తూ, ఉల్లంఘనలు జరుగకుండా చూడాలన్నారు. నేటినుంచే ఎఫ్ఎస్‌టీఎస్, ఎస్‌టీ బృందాలు, చెక్‌పోస్టులు పనిచేయాలన్నారు. భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా మాట్లాడుతూ ఈసీఐ నిబంధనల ప్రకారం నియోజకవర్గంలో పోలింగ్ సాయంత్రం నాలుగు గంటలకే పూర్తవుతుందని, సమస్యాత్మక కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ఎక్కువ మంది భద్రతా సిబ్బందిని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జనగామ కలెక్టర్ షేక్ రిజ్వానాబాషా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణను బాధ్యతతో సమర్థవంతంగా చేపట్టాలని, రోజువారీ నివేదికలు తప్పనిసరిగా అందించాలన్నారు. సమావేశంలో ఏఆర్‌వోలు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్, డీఎస్ వెంకన్న, రోహిత్‌సింగ్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సీదం దత్తు, రాధికాగుప్తా, వైవీ గణేశ్, ఉప ఎన్నికల అధికారులు పీయూష్‌కుమార్, సంధ్యారాణి, కే వెంకటేశ్వర్లు, జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### రూ. లక్షకు పైగా బ్యాంక్ లావాదేవీల వివరాలు సమర్పించాలి

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రూ.లక్షకు పైగా బ్యాంక్ లావాదేవీల వివరాలు సమర్పించాలని జిల్లా ఉప ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి బ్యాంక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని బ్యాంకర్లతో సమావేశమయ్యారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని బ్యాంకు అధికారులకు సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలీ రాజు పాల్గొన్నారు.